క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని అగనంపూడికి చెందిన గురు కృష్ణ చైతన్య అనేదాత రూ.లక్ష116విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాన్ని సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు ప్రోటోకాల్ విభాగం పర్యవేక్షకుడు విక్రమ్ బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

ఘనంగా రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవం


శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న పరవాడ ఎంపీపీ వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు

పరవాడ: ఫార్మాసిటీలోని రాంకీ హబ్‌లో కొలువైన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మ లక్ష్మి శ్రీనివాసరావు శనివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాంకీ హెచ్‌ఆర్ హెడ్ గిరిధర్ బక్షి, పరవాడ మాజీ సర్పంచ్ పైల అప్పారావు, మాజీ ఆర్‌ఈసీఎస్ చైర్మన్ చల్లా కనకరావు అమ్మవారిని దర్శించుకున్నారు.

బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ప్రారంభం

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. శనివారం వాడచీపురుపల్లిలో రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం రూ.60 లక్షలతో నిర్మించనున్న వాడచీపురుపల్లి – వెంకటాపురం బీటీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, జనసేన మండల పార్టీ ఇన్‌చార్జ్ పంచకర్ల ప్రసాద్, వాడచీపురుపల్లి సర్పంచ్ శివలంక లక్ష్మి, సర్పంచ్‌లు మోటూరి సన్యాసినాయుడు, సిరపరపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తం


ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతంలో వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ నాగరాజు

పరవాడ: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో తీర ప్రాంత మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని పరవాడ తహసీల్దార్ బి.నాగరాజు సూచించారు. శనివారం ఆయన ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం గ్రామాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు, ఈదురుగాలులు కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారిన నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటను మానుకోవాలని సూచించారు. తీరంలో ఉన్న తెప్పలు, వలలు, ఇంజన్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. కో–ఆపరేటివ్ మాజీ డైరెక్టర్ సీహెచ్. ముత్యాలరావు తీర ప్రాంత పరిస్థితులను తహసీల్దార్‌కు వివరించారు. తహసీల్దార్ వెంట వీఆర్వో అప్పారావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పాడి అభివృద్ధికి చర్యలు


మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ రామ్మోహనరావు

సబ్బవరం: పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తులను గణనీయంగా పెంచేందుకు పశువైద్యాధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి. రామ్మోహనరావు సూచించారు.శనివారం సబ్బవరంలోని స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో జిల్లాలోని పలు మండలాల పశువైద్యాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర – విజన్ 2047 కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి మండలంలో మొదటి విడతగా వెలుగు సిబ్బంది ద్వారా ఒకే ఒక్క పాడి పశువు కలిగిన 50 మంది రైతులను గుర్తించడం జరిగిందని ఆయన వివరించారు. వారికి బ్యాంకు లింకేజీ ఉన్న స్త్రీ నిధి కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ పథకాల ద్వారా రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని చెప్పారు.

కటిక నేలపై నిద్ర..అసౌకర్యాల నడుమ చదువు | సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల అవస్థలు | సబ్బవరం ఎస్సీ వసతి గృహంలో నాసిరకం పనులు | పరవాడలో చిరిగిపోయిన పరుపులు | సింహచలంలో ప్రమాదకరంగా డార్మెటరీ భవనం

సంక్షోభ వసతి గృహాలు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

నియోజకవర్గంలో వసతిగృహాలు **15**

సింహాచలంలో -1
విద్యార్థుల సంఖ్య : **1,142**

పెందుర్తిలో -4
విద్యార్థుల సంఖ్య : **660**

సబ్బవరం -5
విద్యార్థుల సంఖ్య **1,076**

పరవాడ - 5
విద్యార్థుల సంఖ్య **483**

(మరికొన్ని ఇన్నోవేషన్‌లో భాగంగా నగరంలో నిర్వహిస్తున్నారు)


గత ప్రభుత్వ హయాంలో వసతిగృహానికి మంజూరైన నిధులతో సమకూర్చిన పరుపులపై నిద్రిస్తున్న పెందుర్తి ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థులు


గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన పెందుర్తి ఎస్సీ బాలికల వసతి గృహం మరుగుదొడ్లు


పరవాడ మండలం మెట్టపాలెం ఎస్సీ బాలికల వసతి గృహంలో చిరిగిపోయి మూలకు చేరిన పరుపులు

పెందుర్తి:

జిల్లాలోని పలు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకు గదులు, పూర్తిస్థాయి తలుపులు లేని మరుగుదొడ్లు, కటిక నేలపై నిద్ర వంటి దీనస్థితి నెలకొంది. సబ్బవరం, పరవాడ, సింహాచలంలోని దాదాపు అన్ని వసతి గృహాల్లో విద్యార్థులు అసౌకర్యాల మధ్యే కాలం గడుపుతున్నారు. 'సాక్షి' పరిశీలనలో కొన్ని వసతిగృహాల్లో సమస్యలు బహిర్గతమయ్యాయి.

డార్మెటరీ భవనం శిథిలం

సింహాచలం మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో 1,142 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం వసతి గదుల కొరత తీవ్రంగా ఉంది. 5వ, 7వ తరగతుల విద్యార్థులు కటిక నేలపైనే పడుకుంటున్నారు. డార్మెటరీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. విద్యార్థుల డైనింగ్ హాల్‌లో విద్యుత్ దీపాల వెలుగు అంతంత మాత్రంగానే ఉంది. 500 మంది విద్యార్థుల కోసం గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం ప్రారంభించిన భారీ భవనం పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి.

121 మంది బాలికలకు ఆరు గదులు మాత్రమే..

సబ్బవరం సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ బాలికల వసతి గృహంలో గదులు ఇరుగ్గా ఉండటంతో పాటు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడి పరిస్థితిని చూసిన సర్వశిక్షా అభియాన్ అధికారులు రూ.15 లక్షల నిధులు విడుదల చేసినప్పటికీ, ఆ పనులు ప్రస్తుతం అత్యంత నాసిరకంగా సాగుతున్నాయి. కాంట్రాక్టర్, స్థానిక ఇంజినీరింగ్ అధికారులు కనీస ప్రమాణాలు పాటించడం లేదని, దీంతో నిధులు భారీ ఎత్తున దుర్వినియోగం అయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఇక్కడ 121 మంది బాలికలు ఉండగా, వారందరూ కటిక నేలపైనే నిద్రిస్తున్నారు. అందరికీ కలిపి 20 టాయిలెట్లు ఉండగా, వారు చదువుకునేందుకు, నిద్రపోవడానికి కేవలం ఆరు గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

తీవ్ర ఇబ్బందులు

పరవాడ బీసీ బాలుర వసతి గృహంలో 65 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం వీరికి ఈ ఏడాది దుప్పట్లు, రగ్గులు సరఫరా చేయలేదు.

పరుపులు కూడా ఇవ్వని ప్రభుత్వం

పరవాడ ఎస్సీ బాలికల వసతి గృహంలో 120 మంది విద్యార్థినులు ఉన్నారు. గత ఏడాది ఉన్న పరుపులు పాడవడంతో మూలకు చేరాయి. ప్రభుత్వం కొత్తవి సమకూర్చకపోవడంతో విద్యార్థినులు అందరూ నేలపైనే నిద్రిస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి

పెందుర్తి ఎస్సీ బాలికల వసతి గృహంలో గత ప్రభుత్వ హయాంలో ఈ వసతి గృహానికి సీఎస్ఆర్ నిధులు రావడంతో వసతులు మెరుగుపడ్డాయి. ప్రస్తుతం విద్యార్థినులు అందరూ పరుపులపై నిద్రిస్తున్నారు. మరుగుదొడ్లు కూడా ఆధునీకరించబడ్డాయి.

దీంతో వారంతా నేలపైనే పడుకుంటున్నారు. తానం బీసీ వసతి గృహం, మెట్టపాలెం బాలికల వసతి గృహాల్లో కూడా విద్యార్థులు నేలపైనే నిద్రించాల్సిన దుస్థితి ఏర్పడింది.

త్వరలో వసతిగృహం ప్రారంభం

పెందుర్తి విభిన్న ప్రతిభావంతుల వసతి గృహం పునఃనిర్మాణం కోసం 2023లో నాటి కలెక్టర్ సీఎస్ఆర్ నిధులు సమకూర్చారు. ప్రస్తుతం ఈ భవన నిర్మాణం పూర్తయింది. త్వరలో ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఇక్కడి పిల్లలు పెద వాల్తేరులోని వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్నారు.


పరవాడ వసతిగృహంలో ఇరుగ్గా ఉన్న వంట గది


సబ్బవరంలోని అసౌకర్యాల నడుమ ఎస్సీ బాలికల వసతిగృహం


రూ.15 లక్షలు మంజూరైనా కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో నాసిరకంగా జరుగుతున్న సబ్బవరం ఎస్సీ బాలికల వసతిగృహంలో పనులు

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ శ్రీనివాసరావు, ఎంపీ సీఎం రమేష్

పరవాడ: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనకాపల్లి జోన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. శనివారం అనకాపల్లి జోన్‌లోని 85వ వార్డు, సాలాపువానిపాలెంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. సాలాపువానిపాలెంలో సీసీ రోడ్లు, సీసీ కాలువలు, ఆర్‌సీసీ కల్వర్టులు, 5 కేఎల్ వాటర్ ట్యాంకు, పైప్‌లైన్ నిర్మాణాలకు జీవీఎంసీ నిధులు రూ. 1.32 కోట్లను మంజూరు చేశామన్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష కృషి చేస్తున్నాయని చెప్పారు. అనకాపల్లి నియోజకవర్గంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పరిచేందుకు నిరంతర కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తన పరిధిలో గల సాలాపువానిపాలెం గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, కార్పొరేటర్లు చినతల్లి నీలబాబు, రౌతు శ్రీనివాసరావు, జీవీఎంసీ ఏఈ శేఖర్ పాల్గొన్నారు.

లైంగిక దాడి నిందితుడి అరెస్టుకు డిమాండ్



ఆందోళన చేస్తున్న ఐద్వా సంఘ మహిళలు

పరవాడ: అచ్యుతాపురం మండలంలోని కోనాంపాలెం గ్రామానికి చెందిన యువకుడు బెంగాల్‌కు చెందిన బాలికపై లైంగికదాడికి పాల్పడటాన్ని పరవాడ మండల ఐద్వా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బంగారమ్మ, అన్నపూర్ణలు తీవ్రంగా ఖండించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో శనివారం జేఎస్ఎన్ యూఆర్ఎం కాలనీలో ఆందోళన నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 13 ఏళ్ల బాలిక అచ్యుతాపురం సమీపంలోని కోనాంపాలెం వద్ద ఉన్న ఓ దాబాలో కొంతకాలంగా పనిచేస్తోంది. దాబాను శుభ్రం చేయమని చెప్పి, దాబా యజమాని కుమారుడు బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడని ఐద్వా నాయకులు ఆరోపించారు. అతని స్నేహితులు కూడా బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. దీంతో భయపడిన బాలిక బయటకు పరుగెత్తుకుంటూ వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని ఐద్వా మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బంగారమ్మ, అన్నపూర్ణలు హెచ్చరించారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దేవద్దు...

- కూటమి ప్రభుత్వానిది బందిపోటు దోపిడీ
- సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ డిమాండ్


స్మార్ట్ మీటర్లకు రద్దు చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరిస్తున్న న్యూ డెమోక్రసీ పార్టీ నేతలు

పెందుర్తి: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ఇతర ధరల భారంతో బందిపోట్ల తరహాలో ప్రజలను దోపిడీ చేస్తోందని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల ఏరియా కమిటీ ప్రతినిధి కె. నిర్మల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడానికి 172 వాగ్దానాలు చేశారని, కానీ ఇప్పుడు అందులో ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయకుండా ప్రజలను వంచిస్తున్నారని ఆమె మండిపడ్డారు. విద్యుత్ చార్జీల పెరుగుదల, ట్రూ అప్ ఛార్జీల వసూలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా శనివారం స్థానిక అంబేడ్కర్ నగర్ కాలనీలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ, టీడీపీ, జనసేన, బీజేపీల ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలుగా దోపిడీ చేస్తుందని ఆరోపించారు. విద్యుత్ చార్జీలు పెంచడం కాదు కదా, ఉన్నవి తగ్గిస్తామని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు మాట తప్పారని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇంధన వినియోగ సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజల నుంచి రూ.9,412 కోట్ల భారం మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన చంద్రబాబు, లోకేష్, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే తరిమికొట్టండని పిలుపునివ్వడం గుర్తు లేదా అని నిర్మల ప్రశ్నించారు. వారే ఇప్పుడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఎలా ప్రోత్సహిస్తారని మండిపడ్డారు. బరితెగించి బహిరంగంగా రాష్ట్ర ప్రజలను నయవంచన చేస్తున్న చంద్రబాబు తీరును ప్రజలంతా తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. విద్యుత్ సంబంధిత వసూళ్లతో ప్రజలను దోచుకోవడం ఆపకపోతే తీవ్రస్థాయిలో పోరాటం ఉంటుందని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ పేరుతో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఇందిర, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. తిరుపతిరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి. ఏడుకొండలు, బి. రామకృష్ణ, మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం నాయకుడు అసనాల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై నిరంతర నిఘా



పినగాడి చెక్ పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ పృథ్వీతేజ

పెందుర్తి: గంజాయి నిర్మూలనలో భాగంగా గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వెస్ట్‌జోన్ ఏసీపీ పృథ్వీతేజ అన్నారు. పెందుర్తి సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఏఎస్ఆర్ జిల్లా ఏజెన్సీ ప్రాంతాల నుంచి నగరానికి తరలిపోతున్న గంజాయిని పట్టుకోవడంలో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి తగిన రీతిలో స్పందించి గంజాయితో పాటు ఇతర అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. సిబ్బంది పనితీరును సమీక్షించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్, ఎస్ఐ స్వామినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

210 పశువులకు థైలేరియా వ్యాధి నిరోధక టీకాలు


టీకాలు వేస్తున్న పశు సంవర్ధక శాఖ సిబ్బంది

సబ్బవరం : మండలంలోని చినగొల్లలపాలెం, బంగారమ్మపాలెం, బోదువలస, రావలమ్మపాలెం, బోండవానిపాలెం గ్రామాలలో సుమారు 210 సంకరజాతి పశువులకు శనివారం థైలేరియా వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు సబ్బవరం ప్రాంతీయ పశువైద్యశాల ఇన్‌చార్జ్ సహాయ సంచాలకులు డాక్టర్ వి. చిట్టినాయుడు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మండలంలో నిర్వహించిన పలు పశువైద్య శిబిరాలను ఆయన పరిశీలించారు. దీంతో ఇప్పటివరకు మండలంలోని 4,250 సంకరజాతి పాడి పశువులకు టీకాలు వేసినట్లు చిట్టినాయుడు వివరించారు. మండలంలో ఎవరైనా పాడి రైతులు తమ వద్ద ఉన్న 3 నెలల వయసు దాటిన సంకరజాతి పశువులకు టీకాలు వేయించకపోతే, తమ గ్రామాలలో ఉన్న పశుసంవర్ధక సహాయకులను సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ కనకరాజు మరియు ఆయా గ్రామాల పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల రికార్డులు పరిశీలన


గ్రంథాలయ రికార్డులు పరిశీలిస్తున్న కుమార్‌రాజు

పెందుర్తి: విజ్ఞాన బాండాగారాలైన గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు సూచించారు. శనివారం ఆయన స్థానిక శాఖ గ్రంథాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా కుమార్‌రాజు మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సంబంధించిన దాదాపు అన్ని పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, వాటిని పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు. అలాగే, ధరావత్తు పెంపుతో పాటు సెస్సు వసూలుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో పెందుర్తి, గాజువాక గ్రంథాలయాధికారులు బి.చంద్రకళ, బి.సూర్యకళ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


తహసీల్దార్ చిన్నికృష్ణను సత్కరిస్తున్న విద్యార్థులు

సబ్బవరం: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని, అంకిత భావంతో పనిచేసి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తహసీల్దార్ బి. చిన్నికృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ప్రతిభా విద్యాలయంలో నూతనంగా ఎన్నికైన విద్యార్థి మండలి, హౌస్ లీడర్లను అధికారికంగా ప్రకటించే 'ఇన్వెస్టిచర్ సెరిమొనీ' శనివారం జరిగింది. ఈ సందర్భంగా చిన్నికృష్ణ మాట్లాడుతూ తోటివారిని సరైన మార్గం వైపు దిశానిర్దేశం చేసేవాడే సరైన నాయకుడు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, ప్రిన్సిపాల్ కనకమహాలక్ష్మి, డైరెక్టర్లు నిహారిక, శరత్ తేజ తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు 13 శాతం మందికి పంపిణీ

- వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దే సరకులు

మహారాణిపేట: జిల్లాలో శనివారం నుంచి వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లకు వెళ్లి పీడీఎస్ సరకుల పంపిణీకి పౌర సరఫరాల శాఖ శ్రీకారం చుట్టింది. తొలి రోజు శనివారం 12.30 శాతం మంది దివ్యాంగులు, వృద్ధులకు ఇళ్లకు వెళ్లి రేషన్ డీలర్లు సరకులు పంపిణీ చేశారు. జిల్లాలో 5,24,986 కార్డులు ఉండగా ఇందులో 33,130 మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారు.

వీరిలో శనివారం 4,671 మంది ఇళ్లకు వెళ్లి డీలర్లు సరకులు పంపిణీ చేశారని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎస్.భాస్కరరావు తెలిపారు.